క్లుప్తంగా

ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్లు


మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్లు ఉంటాయని డీపీటీఓ చెంగల్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేట డిపో పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి మంగళవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ రెండు డిపోల పరిధిలోని స్థలాలను లీజుకు తీసుకోవడానికి ఆసక్తి ఉన్న పలువురు వ్యాపారులు విచ్చేశారు. వారికి డీపీటీఓ ఆర్టీసీ నిబంధనలను వివరించారు. టెండర్ల తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు టెండర్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, డిప్యూటీ ఈఈ చెన్నకేశవరావు, వెంకటగిరి, సూళ్లూరుపేట డిపో మేనేజర్లు రాజవర్ధన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి కావాల్సిందే


మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల చివరికల్లా నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఎంఈఓ బాబ్జీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభాకర్ సమక్షంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి పనులను పూర్తి చేయాలన్నారు. హెచ్ఎంలు ఎప్పటికప్పుడు ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. హెచ్ఎంలు మహ్మద్ రఫీ, కుమార్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో ఈనెల 20వ తేదీ నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్, తులసీరాజన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర అమోఘం


హాజరైన ఎన్‌జీఓ ప్రతినిధులు

తిరుపతి సిటీ: విశాల భారతావనిలో స్వచ్ఛంద సేవాసంస్థల పాత్ర అమోఘమని పలువురు ఎన్‌జీఓ సంస్థల ప్రతినిధులు కొనియాడారు. ఎస్వీ యూనివర్సిటీలో ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో రిడో సేవాసంస్థ అధ్యక్షులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో రెండు రోజులగా జరిగిన కాన్సెప్ట్ భారత్ వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఎన్‌జీఓ సంస్థలు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాయని వీటిపై ప్రభుత్వం దృష్టి సారించి సహకరించాలని ప్రతినిధులు కోరారు. స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వహణ, నిధుల సేకరణ, ప్రాజెక్ట్ అంశాలపై సంస్థ ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ కె.మధుసూదన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీపద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చనిపోవడం ద్వారా ఏమీ సాధించలేమని జీవించి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు ఆత్మహత్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహదేవమ్మ, కుశాల్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అంకయ్య, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు


పలు శాఖల అధికారులు, నిమజ్జన కమిటీతో చర్చిస్తున్న కమిషనర్ హరిత


ఉత్సవ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

–కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో వినాయక నిమజ్జనానికి మున్సిపల్ కార్పొరేషన్ తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతిలో వినాయక నిమజ్జనానికి చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో నిమజ్జన కమిటీ సభ్యులు, ఏపీ ఎస్పీడీసీఎల్, అగ్నిమాపక, ఆర్టీసీ, మునిసిపల్ ఇంజినీర్లతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేస్తున్న ప్రతి విగ్రహానికి తప్పనిసరిగా పోలీస్, విద్యుత్ అధికారుల అనుమతులు పొందాలన్నారు. రహదారులను మూసివేసేలా విగ్రహాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. నిమజ్జనానికి కచ్చితమైన రూటు మ్యాప్‌ను రూపొందించి, విగ్రహ నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో తాగునీరు ఏర్పాటు చేయిస్తామన్నారు. టీటీడీ సహకారంతో మామిడి ఆకుల తోరణాలు, కంకణాలు, అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు అందజేస్తామన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణానికి తోడ్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుడా సర్కిల్ వద్ద వినాయక నిమజ్జనం కార్యాలయానికి మున్సిపల్ కార్పొరేషన్ ఆడిటోరియంలో కార్యాలయం కేటాయించినందుకు వినాయక నిమజ్జనం కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వినాయకసాగర్ ప్రాంతాన్ని కమిషనర్, కమిటీ సభ్యులు, అధికారులు పరిశీలించారు.

నిమజ్జన కమిటీ కార్యాలయం ప్రారంభం

తిరుపతి కల్చరల్: వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పూజాది కార్యక్రమాలతో ప్రారంభించారు. చవితి వేడుకలను భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక నగరంలో వినాయక చవితి వేడుకలను అత్యంత వేడుకగా చేపట్టడంతో పాటు మూడో రోజు నిమజ్జనం పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేసుకుందామని తెలిపారు. అందరూ కమిటీకి సహకరించాలని కోరారు. అనంతరం వేడుకల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు వెంకటేశులు, నరసింహాచారి, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు, వారధి విష్ణు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు భానుప్రకాష్, వెంకటేష్, గుండాల గోపినాథ్‌రెడ్డి, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, కరాటే శ్రీనివాస్, ఆర్‌సీ.మునికృష్ణ మధు, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నవసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

–ఎస్వీయూ వీసీ రాజారెడ్డి


సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామిని సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: విద్యార్థులు నవ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో సీఐడీ పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీల సాధికారిత, చట్టాలపై విద్యార్థులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకుని, సమాజాన్ని చైతన్య పరచాలని సూచించారు. బలహీన వర్గాలపై జరిగే అఘాయిత్యాలు, అరాచకాలను రూపు మాపడంలో విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. అనంతరం సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో సమానత్వం, కుల వివక్ష నిర్మూలించడానికి ప్రివెన్షన్ ఆఫ్ సివిల్ రైట్ యాక్ట్ ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీలపై వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. దీంతో 1989లో ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ తీసుకొచ్చి కఠిన శిక్షలను అమలు చేస్తున్నామన్నారు. ఈ సెక్షన్ కింద బాధితులకు ప్రత్యేకమైన హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులను సీఐడీ శాఖ అధికారులు జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏఎస్పీ వెంకటరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, సీఐడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీలక్ష్మి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, రామచంద్రాపురం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నిఘా పర్యవేక్షణ కమిటీ తరపున జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ సైకాలజీ ప్రయోగశాల ప్రారంభం


ల్యాబ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన క్లినికల్ సైకాలజీ విభాగంలో మంగళవారం కొత్తగా క్లినికల్ ప్రయోగశాలను వీసీ భారతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రయోగ శాల ద్వారా మానసిక విద్యను అందించడమే లక్ష్యమన్నారు. ఆరోగ్య సమస్యలు, శరీర రుగ్మతలను నిర్ధారించడంలో ప్రయోగశాల ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. విద్యార్థులు సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని విద్యలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, సైకాలజీ విభాగం అధినేత ప్రొఫెసర్ ఎస్ రజిని, ప్రొఫెసర్ పి సుజాత, సైకాలజీ విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేకే అసత్య ప్రచారం

–విద్యార్థిని తల్లి గీత


హాస్టల్‌లో విద్యార్థినుల నుంచి వివరాల సేకరణ

చంద్రగిరి: తన కుమార్తె హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం ఇష్టం లేకపోవడంతోనే హాస్టల్‌లో తన జుట్టు కత్తరించారంటూ అసత్య ప్రచారం చేసిందని విద్యార్థిని తల్లి గీత తెలిపారు. చంద్రగిరిలోని స్థానిక ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో కొంతమంది విద్యార్థులు తనపై ర్యాగింగ్ చేస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు తన జుట్టును కత్తరించారంటూ 8వ తరగతి చదువుతున్న గీత కుమార్తె డయల్ 100కు ఫోన్ చేసింది. దీంతో సోషల్ మీడియాలో విద్యార్థినిపై ర్యాగింగ్ అంటూ పుకార్లు చక్కర్లు కొట్టాయి. చంద్రగిరి సీఐ రాజశేఖర్ దీనిపై విచారణ చేపట్టాలంటూ ఎస్ఐ హిమబిందును ఆదేశించారు. పోలీసులు, బీసీ వెల్ఫేర్ అధికారుల విచారణలో సదరు విద్యార్థిని హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేకే తన సహచరి విద్యార్థిని సహకారంతో తనే జుట్టును కత్తరించుకున్నట్లు తేలింది. దీనిపై సీఐతో పాటు విద్యార్థిని తల్లి, హాస్టల్ వార్డన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినితో పాటు ఆమెకు సహకరించిన వారిని హాస్టల్ నుంచి సస్పెండ్ చేస్తామని తెలిపారు.

ఎస్‌డీహెచ్ఆర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ: మహతి ఆడిటోరియంలో శ్రీదేవి పట్ల హరినాథ్‌రెడ్డి డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఎస్‌డీహెచ్ఆర్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. విద్యాసంస్థల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు క్యాంపస్ సెలక్షన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సినీ ఆర్టిస్టు శివారెడ్డి మిమిక్రీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ ఉషా పాల్గొన్నారు.

వ్యాపారులకు బీఎన్ఐ దిక్సూచి

–మెగా విజిటర్స్‌డేలో ఏఆర్ రెడ్డి



మోహన్ కుమార్‌రాజును సత్కరిస్తున్న బీఎన్ఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వ్యాపారులకు చక్కటి దిక్సూచిగా నిలిచే వేదిక బిజినెస్ నెట్‌వర్క్ ఇంటరేషనల్ (బీఎన్ఐ) అని డాక్టర్ ఏఆర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో మెగా విజిటర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఆర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యాపారులకు బిజినెస్‌లో తగిన నైపుణ్యాలు, సూచనలు, సలహాలు అందించి వారి అభ్యున్నతికి మార్గదర్శిగా బీఎస్ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు, బీఎన్ఐ అధ్యక్షుడు సాయి కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి శ్రావణకృష్ణా రెడ్డి, ఈవెంట్ కో–ఆర్డినేటర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూజీ కోర్సులకు వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: స్విమ్స్ యూనివర్సిటీలో పలు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సిమ్స్ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో 2023–24వ విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు బీఎస్సీ (నర్సింగ్), బ్యాచలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బీఎస్సీ (పారామెడికల్) కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వెబ్ ఆప్షన్ ద్వారా పైన తెలిపిన కోర్సులకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. సీట్ల సంఖ్య, ఫీజు వివరాలు, ఎంపిక విధానం తదితర వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్ https://svimstpt.ap.nic.in ను సందర్శించాలని ఆ ప్రకటనలో కోరారు.

నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని సాధించడానికి తిరుపతి నగరంలోని అలిపిరి రోడ్డు మెడికల్ కళాశాల సమీపంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ) అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయప్రతాప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న వారు, 8వ తరగతి/ఫిట్టర్, ప్లంబర్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో 80 శాతం ప్రాక్టికల్, 20 శాతం థియరీ ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 9700413939, 9866241270, 9000894035, 7981155147 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోషకాహార లోపాలతో రుగ్మతలు

చంద్రగిరి: సరైన పోషకాహారాన్ని తీసుకోకపోవడం ద్వారా గర్భిణులు, కడుపులోని శిశువులకు అనేక రుగ్మతలు వస్తాయని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత తెలిపారు. మంగళవారం మండలంలోని నరసింగాపురం గ్రామంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోషకాహార ప్రాముఖ్యలత, రుగ్మతలను వివరించారు. మహిళల్లో రక్తహీనత, ఆస్టియా పోరోసిస్, వివిధ రకాల వ్యాధులను అతి తక్కువతో నియంత్రిచుకోవచ్చని తెలిపారు. అనంతరం చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం విశిష్టమైంది

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగుశాఖ అధ్యక్షులు కొలకలూరి మధు జ్యోతి మాట్లాడుతూ.. 1994 నుంచి సాహితీ కార్యక్రమాలు జరుగుతున్నాయని, పలు రంగాల ప్రముఖులను ఆహ్వానించి విద్యార్థులకు ఉపన్యాసాలను ఇప్పించామని తెలిపారు. సాహిత్యం అనేది విశాలం, విస్తృతమైందన్నారు. పూరి వీరేశలింగం రచించిన స్త్రీ విద్య, గరిమెళ్ల సత్యనారాయణ దేశభక్తిపై రచించిన మాకొద్దీ తెల్లదొరతనం వంటి గీతాలను ప్రస్తావిస్తూ విద్యార్థులకు వివరించారు. జాషువా పోరాట పటిమ, కొలకలూరి ఇనాక్ సాహిత్య స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు తేజావాణి, సుభాషిని, లక్ష్మీ ప్రియ, యువశ్రీ పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు–నేడు పూర్తిచేయాలి

తిరుపతి రూరల్: మండలానికి మంజూరైన రెండో విడత నాడు–నేడు పనులను ఈనెలాఖరులోపు పూర్తిచేయాలని తిరుపతి రూరల్ ఎంపీడీఓ వెంకటనారాయణ ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం విద్యాశాఖ, ఇంజినీరింగ్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిపై పాఠశాలల వారీగా ఆరా తీశారు. మండలంలో 34 పాఠశాలలు, 11 అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెండో విడత ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. ఎంఈఓలు దేవరాజులురెడ్డి, భాస్కరయ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌కు అభినందన


చరితను అభినందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కటా, ఫైట్ విభాగాల్లో వెండి, రజిత పతకాలను సాధించిన పి.చరిత ను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభినందించారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లికి చెందిన ప్రియ, నరోత్తం దంపతుల కుమార్తె చరిత చిన్ననాటి నుంచే కరాటేలో విశేష ప్రతిభ చూపేది. ఈ నేపథ్యంలో ఈనెల 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన జాతీయ పోటీల్లో వ్యక్తిగత విభాగాల్లో వెండి, రజిత పతకాలను సాధించడమే కాకుండా టీమ్ చాంపియన్‌షిప్ కై వసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించింది. తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి మంగళవారం చరితను అభినందించారు. కరాటే కోచ్ సింహాచలం, శ్రీహరిరెడ్డి ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


ముద్రనారాయణను సత్కరిస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: నేటి ఆధునిక సమాజానికి అనుగుణంగా మహిళలు నైపుణ్యాలను మెరుగుపర్చుకుని ఆర్థికాభివృద్ధి వైపు పయనించాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అన్నారు. ఎస్టీవీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో మంగళవారం శ్రీమంజునాథ మహిళా సమాఖ్య, క్రాంతి మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. నగర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అండగా నిలవాలని కోరారు. మెప్మా పీడీ రాధమ్మ, సీఎంఎం కృష్ణవేణి, ఐబీ శ్రీరాములు పాల్గొన్నారు.

రేపు అలిపిరి కాలిబాట మార్గం పరిశీలన


ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతోపాటు సభ్యులు గొండు సీతారాం, త్రిపర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతి అలిపిరి కాలినడక మార్గంలో గురువారం తిరుమలకు చేరుకోనున్నారు. ఈ ఏడాది జూన్ 23వ తేదీన చిరుత బారిన పడి కౌశిక్ అనే బాలుడు గాయపడడంతోపాటు, ఆగస్టు 12వ తేదీన లక్ష్మి అనే చిన్నారి చిరుత పులి దాడికి బలై ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో బాలల హక్కుల కమిషన్ వారు తిరుమలకు వెళ్లే అలిపిరి మార్గంలో వెళ్లి, సంఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, చర్యలకు సిఫార్సులు చేయనున్నారు. అంతేకాకుండా తిరుమలలో దేవదాయశాఖ, అటవీ శాఖ, పోలీసు నిఘా విభాగంతో సంఘటనలపై ఆరా తీసి చర్చించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తిరుమలలో బాల్య వివాహాలు జరగకుండా చేపడుతున్న చర్యలను పరిశీలించడం, భిక్షాటన, బాలకార్మికులు నివారణ కోసం చేపడుతున్న చర్యలు గురించి చర్చిస్తారు. తిరుమలలో నిర్వహిస్తున్న వేద పండిత పాఠశాలలను సందర్శిస్తారు. అనంతరం రెండు రోజులు తర్వాత శనివారం మంగళగిరికి చేరుకోనున్నట్లు సమాచారం.

షేక్ ఖాజా విజయంపై అభినందన


ముస్లిం నేతలను, ముత్తవల్లిలను అభినందిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఇటీవల జరిగిన వక్ఫ్‌బోర్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ ఖాజా గెలుపునకు సహకరించిన తిరుపతి జిల్లా ముత్తవల్లిలను, ముస్లిం నేతలను డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అభినందించారు. ఈమేరకు స్థానిక 10, 11 వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన వారిని అభినందించారు. షేక్ ఖాజా గెలుపునకు తోడ్పడిన అభినయరెడ్డిని ప్రభుత్వ ఖాజా సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, వైఎస్సార్‌సీపీ నేతలు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న కేజేఎం డ్రీమ్ ఎంటర్ టైన్‌మెంట్ సంస్థ ప్రతినిధులు

ఫ్యాషన్ 'షో'



ఫ్యాషన్ షోలో వివిధ రాష్ట్రాల మోడల్స్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శిల్పారామం వేదికగా మంగళవారం రాత్రి కేజేఎం డ్రీమ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ప్రతినిధులు కవితా కిషోర్, రేయాన్ష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫియస్టా ఆడిక్షన్ ఫ్యాషన్ వీక్ – 2023 ముద్దుగుమ్మలతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని మిత్ర ఫౌండేషన్ ప్రారంభించగా చంద్రగిరికి చెందిన దివా మిస్ ఇండియా ఐకాన్ – 2023 భావన చిన్నతంబు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా మేయర్ శిరీషతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. భావన చిన్నతంబు మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో పాటు లోకల్ ట్యాలెంట్‌ను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మోడల్స్ పాల్గొన్నట్టు వెల్లడించారు. వివిధ రాష్ట్రాల మోడల్స్ నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. మిత్ర ఫౌండేషన్ సభ్యులు రాగిపాల బాలాజు, గోపీకృష్ణ, మోహన్‌రెడ్డి, పెదపూడి ప్రసాద్ రావు, దామోదర్‌రెడ్డి, మల్లిక పాల్గొన్నారు.